ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 23.03.2026 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు మెట్రో రైలును మరో 76 కిలో మీటర్లు విస్తరించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

2. సన్న బియ్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శాసనసభలో చెప్పారు.

3. గత బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ నిర్వీర్యమైందని, కానీ తమ ప్రభుత్వం ఆర్టీసీకి పూర్వవైభవం తెస్తోందని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

4. స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఈరోజు దేశ వ్యాప్తంగా వారికి ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్‌లోని ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు మెట్రో రైలును మరో 76 కిలోమీటర్లు విస్తరించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈరోజు శాసనమండలిలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి... ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో, ప్రభుత్వమే 15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకుందని తెలిపారు. అలాగే, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తామన్నారు. 30 వేల ఎకరాల్లో ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని, కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు

తరలిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

బైట్ ... ముఖ్యమంత్రి

రాజకీయాలు ఎన్నికలప్పుడే.. అభివృద్ధి విషయంలో అందరూ ఒక్కటి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మూసీ సుందరీకరణ తప్పనిసరి అని దీనికి అందరూ కలిసి రావాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మారుస్తామని భరోసా ఇచ్చారు.

పిటిసి, హైదారాబాద్

**భట్టి విక్రమార్క**

గత ప్రభుత్వం సుమారు 40 వేల కోట్ల రూపాయల బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగుల బకాయిలే 4 వేల 571 కోట్ల రూపాయలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈరోజు శాసనసభలో తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా తాము అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. మూడు డీఏలు గత ప్రభుత్వ హయాంలోనే పెండింగ్‌లో పడ్డాయని, మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే చెల్లిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనసభలో ఉద్యోగుల సమస్యలపై చర్చ సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. అంతకుముందు, ఈ అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ఎప్పటిలోగా చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల బకాయిలు, వైద్య సౌకర్యాల విషయంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని ఆయన ప్రశ్నించారు.

పిటిసి, హైదరాబాద్

**సన్నబియ్యం**

సన్న బియ్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బియ్యం కుంభకోణం జరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలోని అన్ని అక్రమాలపై దర్యాప్తు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈరోజు శాసనసభలో మంత్రి మాట్లాడుతూ... తమది రైతు పక్షపాత ప్రభుత్వమని అన్నారు. రైతుల నుంచి రికార్డు స్థాయిలో బియ్యం సేకరించామని, 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నగదు చెల్లించామని తెలిపారు. ఇంకా మిగిలిన బియ్యం కూడా కొనుగోలు చేస్తామన్నారు. ఈ రబీలో కూడా ప్రతి గింజనూ కొంటామని హామీ ఇచ్చారు.

PTC, HYD

**బియ్యం ఎగుమతులు**

రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల చుట్టూ భారీ కుంభకోణం జరిగిందని ఇవాళ అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌజ్ కమిటీ' వేయాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సభను తప్పుదోవ పట్టించవద్దని మంత్రి కోరారు.

డెస్క్

**ఆందోళన**

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని ఆరోపిస్తూ BRS ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా గల గన్ పార్క్ వద్ద ఆందోళన చేపట్టారు. సుమారు 12 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ప్లకార్డులు చేతపట్టి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ... ఫీజులు అందక వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని మండిపడ్డారు. గత

ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తే, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.

పిటిసి, హైదరాబాద్

**ఆర్టీసీ పై చర్చ**

గత బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ నిర్వీర్యమైందని, కానీ తమ ప్రభుత్వం ఆర్టీసీకి పూర్వవైభవం తెస్తోందని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈరోజు తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా ఆర్టీసీ లాభనష్టాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య చర్చ సందర్భంగా మంత్రి ఈ మాటలన్నారు. అంతకుముందు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ... ఆర్టీసీ లాభాల్లో ఉందో, నష్టాల్లో ఉందో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల కలిగిన 9 వేల 200 కోట్ల రూపాయల బకాయిలు ఆర్చీసికి చెల్లించారా అని ప్రశ్నించారు. కార్మికుల పీఆర్సీ, బకాయిల పరిస్థితి ఏమిటో తెలియజేయాలని, యూనియన్ల పునరుద్ధరణ, కొత్త బస్సుల కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పిటిసి, హైదరాబాద్

**MARTYRDOM:**

స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి - షహీద్ దివస్ సందర్భంగా ఈరోజు దేశ వ్యాప్తంగా ఆ మహనీయులకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, స్పీకర్ ఓం బిర్లా, తదితరులు వారికి నివాళులర్పించారు. అతి పిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడి, దేశం కోసం అత్యున్నత త్యాగం చేశారని కొనియాడారు.

అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, మేరా యువ భారత్ ఈరోజు దేశ వ్యాప్త పద్ యాత్రను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం 'నా భారత్, నా బాధ్యత' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ పద్ యాత్రలు దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నారు.

NSD

**చలో అసెంబ్లీ**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో, బీజేపీ ఆధ్వర్యంలో ఈరోజు చలో అసెంబ్లీ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చలో అసెంబ్లీకి బీజేపీ పిలుపునిచ్చింది. అసెంబ్లీ వైపు తరలివస్తున్న కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. బిజెపి ఛలో అసెంబ్లీ పిలుపు నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

-పిటిసి, హైదరాబాద్

**బిజెపి నిరసన – నల్గొండ**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈరోజు బిజెపి ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లా నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ కు బయలుదేరారు. దీంతో ఈ తెల్లవారుజాము నుంచే బిజెపి నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నారు. నల్లగొండ పట్టణంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పకీరు మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గడ్డం మహేష్, కార్పొరేటర్ అక్కెనపల్లి బలరాం, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు దాసోజు యాదిగిరాచారి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు పెరిక మునికుమార్, తదితర నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్థానిక వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. పోలీసుల రాకను గమనించిన మరికొంత మంది నాయకులు ఇతర మార్గాల ద్వారా హైదరాబాద్ కు బయలుదేరి వెళ్లారు.

పిటిసి, నల్గొండ

**రైతు భరోసా నిధులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయడంతో ఈరోజు హన్మకొండ, వరంగల్ జిల్లాలలో రైతుల ఖాతాలలో నగదు జమ అవుతోంది. వరంగల్ జిల్లాలోని ఒక లక్ష

55 వేల 170 మంది రైతుల ఖాతాలలో సుమారు 75 కోట్ల 95 లక్షల రూపాయలు, హన్మకొండ జిల్లాలోని ఒక లక్ష 43 వేల 394 మంది రైతుల ఖాతాలలో సుమారు 70 కోట్ల 5 లక్షల రూపాయలు జమ కానున్నాయి. రైతు భరోసా నిధులు జమ అవుతున్న క్రమంలో రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పిటిసి, వరంగల్

**బాంబు బెదిరింపులు**

ములుగు జిల్లా న్యాయస్థానానికి ఈరోజు బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు కోర్టులో బాంబు ఉందంటూ కోర్టుకు వచ్చిన బెదిరింపు మెయిల్ బోగసుదని తనిఖీల అనంతరం తేలింది. తొలుత మెయిల్ సమాచారం అందుకున్న సిబ్బంది పోలీసులకు పిర్యాధు చేయడంలో బాంబ్ స్క్వాడ్ బృందం కోర్టుకు చేరుకొని తనిఖీలు నిర్వహించింది. ఇది బోగస్ మెయిల్ గా వారు గుర్తించారు. దీంతో కోర్టు కార్యకలపాలు కొద్దిసేపు నిలిచిపోయాయి. మెయిల్ ద్వారా తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

పిటిసి, ములుగు